## ప్రశ్నలు (రూల్ 38-52)

శాసనసభలో ప్రశ్నల సమయమందలి కార్యక్రమం విశిష్టతను సంపాదించుకున్నది. ఆ సమయానికి అత్యంత ప్రాధాన్యతను యిస్తున్నారు. ప్రశ్నల సమయంలో సభా కార్యకలాపాలు చాల ఆకర్షవంతంగా ఉంటూ కుతూహలాన్ని కల్గిస్తూ సజీవంగా ఉంటాయి. అందుచేత శాసనసభలో ప్రశ్నల సమయమందు ప్రేక్షకుల, పత్రికల వారి గ్యాలరీలు క్రిక్కిరిసి ఉంటాయి. ప్రశ్నల సమయంలో సభలో సభ్యులు పాలనా యంత్రాంగానికి సంబంధించి, పాలనా విషయాలకు సంబంధించి ఎంతో విలువైన, అమూల్యమైన సమాచారాన్ని రాబడ్డారు. ఆ సమయంలో సభలో ఆయా సమయాల్లో వాగ్వివాదాలు చెలరేగి ఉద్రిక్త వాతావరణం వ్యాపించి ఉంటుంది. అంతలోనే సభలో ఎవరో విసిరిన ఛలోక్తికి సభ నవ్వులతో ప్రతిధ్వనిస్తూ ప్రశాంతత ఏర్పడుతుంది. ప్రశ్నల సమయంలో సభ్యులు ప్రజా ప్రాముఖ్యమైన విషయాలపై అమూల్యమైన సమాచారాన్ని రాబట్టి వాటి బాగోగులను ప్రజల దృష్టికి తెస్తారు. అదేవిధంగా ప్రజల కష్టసుఖాలను, అవసరాలను ప్రభుత్వ దృష్టికి తెచ్చేవారు ప్రజా సమస్యల పరిష్కారానికి అనుకూలపడ్డారు. శాసనసభ కార్యనిర్వహణ వర్గంపై నియంత్రణ వహించటానికి ఇదొక మచ్చుతునక. ప్రశ్నలను అడగటం, ప్రభుత్వం నుంచి సమాచారాన్ని రాబట్టటం ప్రజా ప్రతినిధుల హక్కు. అందుకే ప్రతిరోజు సభా సమావేశం ప్రశ్నలతో ప్రారంభం అవుతుంది. ప్రశ్నలను అడగటంలో ప్రధాన ఉద్దేశ్యం మంత్రి నుండి సమాచారాన్ని రాబట్టడం. దీని వలన సభ్యులకు ఆ అవకాశం ఏర్పడుతుంది. ప్రశ్నల ద్వారా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. ప్రజాభిప్రాయాన్ని తెలుసు కోవడానికి ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. సభ్యులు వేసే ప్రశ్నలను పరిశీలిస్తే నిత్య జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అంశాలపై ప్రశ్నలను వేయటం సమాధానాలను రాబట్టటం జరుగుతోంది. ప్రశ్నలే లేకపోతే ఈ విషయాలు ఎన్నో వెలుగులోనికి రాకుండా పోయేవి. కనుక ప్రశ్నల సమయం ఆకర్షవంతం గాను, విజ్ఞాన దాయకంగాను ఉంటుందనటంలో సందేహం లేదు.

### ప్రశ్నలు వాటి రకాలు:

ప్రశ్నలు మూడురకాలు, అవి : 1.నక్షత్రపు గుర్తు ప్రశ్నలు. 2.నక్షత్రపు గుర్తులేని ప్రశ్నలు. 3. స్వల్ప వ్యవధి ప్రశ్నలు.

### 1. నక్షత్రపు గుర్తు ప్రశ్నలు : (రూల్-40)

సభ్యుడు సభాసమక్షంలో వాగ్రూపంగా సమాధానం అడిగే ప్రశ్నలను నక్షత్రపు గుర్తు ప్రశ్నలు అని అంటారు. సభ్యుడు తన ప్రశ్నకు వాగ్రూపంగా సమాధానం కోరేటప్పుడు ఆయన తన ప్రశ్నకు నక్షత్రపు గుర్తు పెట్టాలి.

### 2. నక్షత్రపు గుర్తులేని ప్రశ్నలు :

సభ్యుడు తన ప్రశ్నకు లిఖితపూర్వకమైన సమాధానాన్ని కోరుతూ యిచ్చిన ప్రశ్న నక్షత్రపు గుర్తులేని ప్రశ్న అని అంటారు. సభ్యుడు తన ప్రశ్నకు నక్షత్రపు గుర్తు పెట్టి ప్రత్యేకించని యెడల, ఆ ప్రశ్నను లిఖితపూర్వక సమాధానం కోరు ప్రశ్నల జాబితాలో ముద్రిస్తారు. ఆ విధంగా ముద్రించిన ప్రశ్నలను, సమాధానాలను ఒక జాబితాగా రూపొందించి సభాసమక్షంలో పెడతారు.

### 3. స్వల్ప వ్యవధి ప్రశ్న: (రూల్-51)

అత్యవసర ప్రజా ప్రాముఖ్యం గల విషయానికి సంబంధించిన ప్రశ్నను స్వల్ప వ్యవధి ప్రశ్న అని అంటారు. ఇవి స్వల్ప వ్యవధిలో అడుగదగు ప్రశ్నలు. ఆ ప్రశ్నలోని విషయం అత్యంత ప్రజాప్రాముఖ్యంగల అత్యవసర విషయం అని సభాపతి భావించిన యెడల, ఆ ప్రశ్నకు తాను నిర్ణయించిన రోజు సమాధానం యివ్వాలని సంబంధిత మంత్రిని ఆదేశించవచ్చును. స్వల్ప వ్యవధిలో తన ప్రశ్నకు సమాధానం కావాలని కోరే సభ్యుడు ఆ విధంగా ఆ ప్రశ్నను అడగటానికి కారణాలను పేర్కొనాలి.

### ప్రశ్నల నోటీసు (రూల్-39)

ప్రశ్నల నోటీసు లిఖితపూర్వకంగా ఉండాలి. కార్యదర్శిని సంబోధించి యివ్వాలి. ఆ విధంగా వ్రాసిన ప్రశ్నను సభ్యుడు స్వయంగా యివ్వవచ్చు. లేదా శాసనసభా కార్యాలయంలో కార్యాలయం పనిచేసే సమయాల్లో నోటీసు బాక్సులో ఆ ప్రశ్నను లేక ప్రశ్నలను ఉంచవచ్చు. ప్రశ్న అందిన తేదీ నుండి ఎనిమిది రోజుల్లో ఆ ప్రశ్నకు సభా సమక్షంలో సమాధానం ఇవ్వాలి.

### ప్రశ్నల అంగీకారానికి నిబంధనలు : (రూల్-43)

ప్రశ్నలు ఈ దిగువ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. ఆ విధంగా లేని ప్రశ్నలను అంగీకరింపరు.

(1) ప్రశ్న అర్థమవటానికి తప్పనిసరిగా అవసరం కానట్టి ఏ పేరును గాని, వివరణను గాని ప్రశ్నలో పేర్కొనరాదు.

(2) ప్రశ్నలోని స్టేటుమెంటు నిర్దిష్టతకు సభ్యుడు తన బాధ్యత వహించాలి.

(3) ప్రశ్నలో వాద ప్రతివాదాలు, ఊహలు, వ్యంగోక్తులు, ఆరోపణలు, సాభిప్రాయ శబ్దాలు, లేదా అపఖ్యాతి హేతువులగు వాక్యాలు ఉండకూడదు.

(4) అభిప్రాయాన్ని తెల్పమనిగాని, అనిర్దిష్టన్యాయ సూక్ష్మాన్ని గాని ఊహాజనిత సమస్యను పరిష్కరింపమని గాని అడుగరాదు.

(5) ఒక వ్యక్తి అధికార హోదా లేక ప్రజా జీవితానికి సంబంధించి తప్ప అతని శీలాన్ని లేక ప్రవర్తనను గురించి గాని అడుగరాదు.

(6) ప్రశ్న 150 పదాలకు మించి ఉండరాదు.

(7) రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించని విషయాలకు సంబంధించి ప్రశ్నలు అడుగరాదు.

(8) ఏ సమితి తన నివేదికను విధాన సభకు సమర్పించలేదో అట్టి సమితి కార్యకలాపాలను గురించి ప్రశ్నలు అడుగరాదు.

(9) ప్రత్యేక (ప్రబల) ప్రతిపాదనపై మాత్రమే అధిక్షేపింపదగు ఏ వ్యక్తి శీలాన్ని గాని, ప్రవర్తనను గాని నిందించునట్టిదిగా ప్రశ్న ఉండరాదు.

(10) వ్యక్తిగతమైన ఆరోపణలను చేయరాదు లేక సూచించరాదు.

(11) సభాసమక్షంలో సమాధాన పరిమితులలో వివరించరానంత విస్తారమైన పాలసీ విషయాన్ని ఈ గూర్చి అడుగరాదు.

(12) పూర్వం సమాధానం యిచ్చిన లేక సమాధానాన్ని నిరాకరించిన ప్రశ్నల సారాంశం గల ప్రశ్నలను అడుగరాదు.

(13) అల్పమైన లేక నిష్ప్రయోజనమైన విషయాలను గురించి సమాచారం అడుగరాదు.

(14) అందుబాటులో గల పత్రాల్లో గాని పరిశీలనా గ్రంధాలలో గాని పొందుపరచిన సమాచారాన్ని కోరరాదు.

(15) రాష్ట్ర ప్రభుత్వానికి బాధ్యత వహింపని సంస్థల, వ్యక్తుల అదీ నమందున్న విషయాలను అడుగరాదు.

(16) భారతదేశంలో ఏ భాగంలోనైనా విచారణాధికారం గల న్యాయాలయాల తీర్పులోనున్న విషయాన్ని గురించిన సమాచారాన్ని అడుగరాదు.

(17) అది కారరీత్యా మంత్రికి సంబందించని విషయానికి సంబందించి ప్రశ్న అడుగరాదు.

(18) మిత్రదేశానికి చెందిన ప్రశ్న అమర్యాదకరంగా ఉండరాదు.

(19) మంత్రిమండలి జరిపిన చర్చలను గురించి గాని లేదా ఏ విషయానికి సంబందించిన సమాచారాన్ని వెల్లడి చేయరాదని రాజ్యాంగ చట్టం లేక సాంప్రదాయాన్ని బట్టి నిబంధన కలదో అట్టి విషయాలనులేదా గవర్నరుకు ఇచ్చిన సలహాను గురించి గాని సమాచారం అడుగరాదు.

(20) సమితి పరిశీలనలోనున్న విషయాలను గూర్చి సాధారణంగా ప్రశ్నలు అడుగరాదు.

(21) చట్టరీత్యా ఏర్పాటై జుడిషియల్ లేక జుడిషియల్ పోలిన విధులను నిర్వహించు ట్రిబ్యునల్ లేక కాంపిటెంట్ అథారటీ, ఏదేని విషయాన్ని గురించి విచారణ జరపటానికి లేక దర్యాప్తు చేయటానికి నియమించిన కమీషను లేక విచారణ న్యాయాలయం పరిశీలనలో నున్న విషయాన్ని గురించి అడుగరాదు. అయితే ఆ ట్రిబ్యునల్ లేక కమీషన్ లేక విచారణా న్యాయాలయం లేక న్యాయస్థానం లేక కాంపిటెంట్ అథారిటీ ఒక విషయంలో చేస్తున్న పరిశీలనకు భంగం కల్గకుండా ఉండే యెడల, ఆ విచారణా దశకు సంబంధించిన విషయాలను ప్రస్తావింపవచ్చును.



# 1

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్య విధానం సంపుటి

## ప్రశ్నలు




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.